క్లుప్తంగా

దిగువ ఆయకట్టుకు నీరు విడుదల



ఏలేరులో వరదనీరు

ఏలేశ్వరం: ఏలేరు ప్రాజెక్టు నుంచి దిగువ ఆయకట్టుకు నీరు విడుదల చేస్తున్నారు. ఖరీఫ్ సీజన్ నిమిత్తం ఆయకట్టుకు 440 క్యూసెక్కుల నీటిని సరఫరా చేస్తున్నారు. గత కొన్ని రోజులుగా ఎగువ ప్రాంతంలో వర్షాలు పడుతుండడంతో నీటినిల్వలు భారీగా పెరిగాయి. ఎగువ ప్రాంతం నుంచి 2,032 క్యూసెక్కుల నీరు వచ్చి చేరింది. దీంతో మంగళవారం నాటికి ప్రాజెక్టులో 86.56 మీటర్లకు 82.38 మీటర్లు, 24.11 టీఎంసీలకు 16.44 టీఎంసీల నీటినిల్వలు ఉన్నాయి. దీంతో విశాఖకు 300 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

90 శాతం రాయితీపై డ్రిప్, స్ప్రింకర్లు

గండేపల్లి: రైతులకు ప్రభుత్వం 90 శాతం రాయితీపై డ్రిప్, స్ప్రింకర్లను అందజేస్తున్నట్టు ఉద్యానశాఖ హెచ్ఓ లావణ్య తెలిపారు. గండేపల్లి మండలానికి 800 హెక్టార్లు, జగ్గంపేట మండలానికి 700 హెక్టార్లకు మంజూరయ్యాయని, కావాల్సిన రైతులు ఆయా గ్రామాలలోని రైతు సేవా కేంద్రాలలో పేర్లు నమోదు చేయించుకోవాలన్నారు.

అవయవదానంతో మరొకరికి జీవితం



మల్టీ ఆర్గాన్ ఫౌండేషన్ ఫౌండర్, చైర్మన్‌ను సత్కరిస్తున్న ప్రిన్సిపాళ్లు

గండేపల్లి: అవయవదానంతో మరొకరికి జీవాన్ని ప్రసాదించవచ్చునని మల్టీ ఆర్గాన్ ఫౌండేషన్ ఫౌండర్, చైర్మన్ బాదం బాలకృష్ణ పేర్కొన్నారు. సూరంపాలెం ఆదిత్య యూనివర్సిటీలో ఫార్మసీ కళాశాలలో మంగళవారం వరల్డ్ ఆర్గాన్ డొనేషన్ డే నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ దానాలలో అవయవదానం ప్రధానమని అన్నారు. అవయవదానం గురించి ఇతరులకు అవగాహన కల్పించాలన్నారు. అనంతరం ఆయనను జ్ఞాపికతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కె.రవిశంకర్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ పి.ప్రశాంతి, బీఎస్‌టీ వైదేహి, శేషసాయిదుర్గ, కె.రామకృష్ణ, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

అథ్లెటిక్ స్టేట్‌మీట్‌కు అర్హత సాధించిన విద్యార్థులు

గండేపల్లి: గుంటూరులోని ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో సెప్టెంబర్ 14, 15, 16 తేదీల్లో జరిగే స్టేట్ మీట్‌కు సూరంపాలెం ఆదిత్య యూనివర్సిటీ విద్యార్థులు అర్హత సాధించారు. ఈ సందర్భంగా డిప్యూటీ చాన్సలర్ శ్రీనివాసరెడ్డి మంగళవారం మాట్లాడుతూ కాకినాడ పీఆర్ కళాశాలలో ఈ నెల 11వ తేదీన జరిగిన అండర్ 23 అథ్లెటిక్స్ జిల్లా సెలక్షన్ ట్రయల్స్‌లో తమ విద్యార్థులు తొమ్మిది మంది ప్రతిభ చూపారన్నారు. ఎంపికైన విద్యార్థులను వైస్ చాన్సలర్ ఎస్.రమాశ్రీ, రిజిస్ట్రార్ జి.సురేష్, హెచ్ఓడీ జీవీ ప్రతాప్ రెడ్డి అభినందించారు.

చెడు అలవాట్లకు బానిసలు కావొద్దు

గండేపల్లి: చెడు అలవాట్లకు బానిసలై బంగారు భవితను నాశనం చేసుకోవద్దని డిప్యూటీ చాన్సలర్ ఎం.శ్రీనివాసరెడ్డి అన్నారు. సూరంపాలెం ఆదిత్య యూనివర్సిటీలో మంగళవారం మాదక ద్రవ్యాల నిర్మూలనపై అవగాహన సదస్సు, ప్రతిజ్ఞ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం యువతకు మాదక ద్రవ్యాలపై సరైన అవగాహన లేకపోవడంతో చెడు అలవాట్లకు బానిసలుగా వారి జీవితాన్ని పాడుచేసుకుంటున్నారన్నారు. చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో డీన్ డోలా సంజయ్, వి సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శులకు షోకాజ్ నోటీసులు

రౌతులపూడి: మండలంలోని ఆరుగురు పంచాయతీ కార్యదర్శులకు ఎంపీడీఓ ఎం.ప్రేమ్ సాగర్ షోకాజ్ నోటీసులు ఇచ్చారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన పంచాయతీ కార్యదర్శులకు, సర్పంచులకు నిర్వహిస్తున్న శిక్షణా కార్యక్రమానికి ఆలస్యంగా హాజరైనందుకు వారికి నోటీసులు జారీ చేసినట్టు ఎంపీడీఓ తెలిపారు. మండలంలోని ములగపూడి నుంచి ఎస్.విమలాకుమారి, లచ్చిరెడ్డిపాలెం నుంచి ఆర్.సియోన్‌కుమార్, ఎ.మల్లవరం నుంచి డీఎస్ఎన్ఎస్ఎన్ మూర్తి, పారుపాక నుంచి పి.శివకుమార్, బంగారయ్యపేట నుంచి ఎస్.వినోద్‌కుమార్, రౌతులపూడి–2 నుంచి జె.సౌమిత్రలకు నోటీసులు అందజేశారు. ఈ నోటీసులపై సంబంధిత అధికారుల సమగ్ర వివరణ ఇవ్వాలని కోరారు.

ఇంకెన్నాళ్లీ.. ట్రాఫిక్ కష్టాలు

- పెరిగిన వాహనాలతో ఇబ్బందులు
- విస్తరణకు నోచుకోని మెయిన్ రోడ్డు
- వెంటాడుతున్న సిబ్బంది కొరత
- ప్రయాణికులకు తప్పని అవస్థలు



జనంతో రద్దీగా ఉన్న తుని మెయిన్ రోడ్డు

తుని: ప్రభుత్వాలు మారుతున్నా పట్టణ ప్రజలకు ట్రాఫిక్ కష్టాలు తప్పడం లేదు. జనాభాతో పాటు వాహనాల సంఖ్యా రెట్టింపవుతోంది. ఇందుకు అనుగుణంగా రహదారులు లేకపోవడంతో ట్రాఫిక్ సమస్య తరచూ ఎదురవుతోంది. మున్సిపల్ అధికారులు, పోలీసులు కలిసి ప్రధాన రహదారుల్లో ఆక్రమణలను తొలగించినా పరిస్థితిలో మార్పు రాలేదు. ప్రధాన రహదారుల్లో వాహన చోదకులు ఇబ్బంది పడుతున్నారు. రెండు దశాబ్దాగా మెయిన్ రోడ్డు విస్తరణ జరగలేదు. గత ప్రభుత్వంలో మాజీ మంత్రి దాడిశెట్టి రాజా కృషి ఫలితంగా విస్తరణ పనులకు నిధులు మంజూరు చేశారు. విస్తరణలో భాగంగా తొలగించాల్సిన భవనాల యాజమానులు కోర్టును ఆశ్రయించడంతో పనులకు అంతరాయం ఏర్పడింది. గ్రేడ్–2 మున్సిపాలిటీగా ఉన్న తునికి ట్రాఫిక్ విభాగం లేక పోవడంతో ఇబ్బందులు కలుగుతున్నాయని ప్రజలంటున్నారు. కొత్త ప్రభుత్వం మెయిన్ విస్తరణకు చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

ఇదీ పరిస్థితి

తుని పట్టణ విస్తీర్ణం 7.02 చదరపు కిలోమీటర్లు. జనాభా 54 వేల మంది ఉండగా 14 వేల కుటుంబాలు ఉన్నాయి. వీరిలో ప్రతి కుటుంబానికి వాహనాలు ఉన్నాయి. రవాణా శాఖ నుంచి సేకరించిన సమాచారం ప్రకారం పట్టణంలో 9 వేల ద్విచక్ర వాహనాలు, 276 కార్లు, 115 భారీ వాహనాలు ఉన్నాయి. ఇవి కాకుండా తుని, కోటనందూరు, తొండంగి, రౌతులపూడి, పాయకరావుపేట, శంఖవరం తదితర మండలాల నుంచి రోజుకు 25 వేల మంది వివిధ పనులపై తుని పట్టణానికి వస్తుంటారు. పదేళ్లలో వాహనాల సంఖ్య రెట్టింపుగా పెరిగింది. అయితే దీనికి అనుగణంగా రహదారులు మాత్రం లేదు. పట్టణంలో ఐదు ప్రధాన రోడ్లు ఉన్నాయి. వీటిలోనే ఎక్కువ వాహన రాకపోకలు సాగుతున్నాయి. జీఎన్‌టీ రోడ్డు, సూరవరం రోడ్డు, ప్రకాశం రోడ్డు, మెయిన్ రోడ్డు, పెంటకోట రోడ్లు కీలకమైనవి. వీటిలో సూరవరం రోడ్డు, ప్రకాశం రోడ్లు విస్తరణ చేశారు. మెయిన్ రోడ్డు, పెంటకోట రోడ్లకు ప్రభుత్వం రూ.54 కోట్లు నిధులు మంజూరు చేసినా పనులు జరగలేదు. ఇందుకు ప్రధాన కారణం స్థల సేకరణ నష్ట పరిహారం ఎక్కువగా ఉండడంతో సాంకేతిక సమస్య ఉందని అధికారులు చెబుతున్నారు.

భారీ వాహనాలతో ఇబ్బందులు

అసలే ఇరుకైనా రోడ్లు అందులో భారీ వాహనాల రాకపోకలతో మరిన్ని అవస్థలు పడాల్సి వస్తోంది. విశాఖ జిల్లా పాయకరావుపేట మండలంలో ఉన్న ప్రైవేటు బల్క్ మందుల తయారీ పరిశ్రమ ఉంది. ఇక్కడ తయారైన బల్క్ మందులను కంటైనర్స్‌లో విశాఖపట్నం పోర్టుకు తరలించి, అక్కడ నుంచి విదేశాలకు ఎగుమతి చేస్తున్నారు. ముడి సరుకు, రసాయనాలు, మిషనరీ తదితర వస్తువులను పెద్ద ట్రాలీల్లో తుని పట్టణం మీదుగా రవాణా చేస్తున్నారు. పురపాలక సంఘం వాహనాల రాకపోకలను ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకున్నారు. ఉదయం, సాయంత్ర వేళల్లో విద్యార్థులు స్కూళ్లకు రాకపోకలు చేస్తారని, ఈ సమయంలో భారీ వాహనాలను నిలిపివేయాలని ప్రజలు కోరుతున్నారు.

ట్రాఫిక్ విభాగం ఏర్పాటు చేయాలి



పట్టణంలో పెరిగిన ట్రాఫిక్‌ను నియంత్రించడానికి ట్రాఫిక్ విభాగం ఏర్పాటు చేయాలి. అదనంగా ఎస్సై, సిబ్బంది అందుబాటులోకి వస్తారు. దీంతో మెయిన్ రోడ్డు ఇతర ప్రాంతాల్లో సమస్యకు పరిష్కారం లభిస్తుంది. ప్రస్తుత ఎమ్మెల్యే యనమల దివ్య, ఎమ్మెల్సీ యనమల రామకృష్ణుడును కలిసి సమస్యను వివరించాం. ప్రజలకు మెరుగైన రవాణా సదుపాయం కల్పనకు చాంబర్ ఆఫ్ కామర్స్ ద్వారా చర్యలు తీసుకుంటాం.

–సకురు నాగేంద్ర నెహ్రూ, చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు,తుని

నియంత్రణకు చర్యలు



పట్టణంలో ట్రాఫిక్ సమస్య నియంత్రణకు చర్యలు చేపట్టాం. గొల్ల అప్పారావు సెంటర్ నుంచి తలుపులమ్మ అలయం వరకు సెంటర్ డివైడర్ ఏర్పాటు చేశాం. ఉదయం 8.30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటలు, సాయంత్రం 4 నుంచి రాత్రి 8 గంటలకు మెయిన్ రోడ్డులోకి వ్యాన్లు, ఆటోలను అనుమతించం. లోడింగ్ ఆటోలకు అనుమతి ఇచ్చాం. మధ్యాహ్నం 12.30 నుంచి సాయంత్రం 4 గటంల వరకు తోపుడు బండ్లు వ్యాపారులకు అనుమతి ఉంది. ప్రజలు సహకరిస్తే అనుకూల ఫలితాలు వస్తాయి. తుని పోలీస్ స్టేషన్‌లో 45 మంది సిబ్బంది ఉన్నారు. వీరిలో కొందరిని ఇతర ప్రాంతాలకు బందోబస్తు కోసం పంపుతున్నాం. దీంతో సిబ్బంది కొరత ఉంది. –గీతా రామకృష్ణ, సీఐ, తుని

ప్రొటోకాల్‌పై వైఎస్సార్ సీపీ ఫిర్యాదు



ఎంఈఓకు ఫిర్యాదు చేస్తున్న నాయకులు

ఏలేశ్వరం: శ్రీసర్వేపల్లి రాధాకృష్ణ విద్యామిత్ర పథకంలో భాగంగా ప్రభుత్వ పాఠశాలల్లో పుస్తకాలు, బ్యాగుల పంపిణీలో ప్రొటోకాల్ పాటించడం లేదని వైఎస్సార్ సీపీ నాయకులు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఎంఈఓ అబ్బాయికి వినతిపత్రం అందజేశారు. ఈ మేరకు వారు మాట్లాడుతూ పట్టణంలో ప్రభుత్వపాఠశాలల్లో పుస్తకాలు, బ్యాగుల పంపిణీలో వైఎస్సార్ సీపీకి చెందిన మున్సిపల్ కౌన్సిలర్లకు సమాచారం ఇవ్వడం లేదని, ఈ పథకం ఏ పార్టీకి చెందింది కాదని వారు ఆరోపించారు. గతంలో తాము అధికారంలో ఉండగా ఎటువంటి వివక్ష చూపలేదన్నారు. దీనిపై తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పార్టీనాయకులు సామంతుల సూర్యకుమార్, సుంకర రాంబాబు, తొండారపు రాంబాబు, ఎస్‌వెంకటేశ్వరరావు, కోరాడప్రసాద్, వాగు బలరామ్ తదితరులు పాల్గొన్నారు.

ప్లేట్‌లెట్లు తగ్గితే ప్రమాదం



కొత్తూరులో పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ సౌమ్యశ్రీ

శంఖవరం: డెంగీ వ్యాధి కారణంగా ప్లేట్‌లెట్లు తగ్గిపోతాయని, నిర్లక్ష్యం చేస్తే ప్రాణానికే ప్రమాదమని పి.మల్లాపురం పీహెచ్‌సీ వైద్యాధికారి సౌమ్యశ్రీ తెలిపారు. కొత్తూరు గ్రామంలో సీజనల్ వ్యాధులపై ఆమె అవగాహన కల్పించారు. సౌమ్యశ్రీ మాట్లాడుతూ ఏడిస్ దోమ కుట్టడం వల్ల డెంగీ వస్తుందని, ఈ దోమ పగటి పూట కుడుతుందన్నారు. డెంగీ వ్యాధికి ప్రత్యేక చికిత్స ఏమీ లేదని, లక్షణాలను చూసి జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వర్షాకాలంలో దోమల నియంత్రణకు దోమల తెరలు, మస్కిటో కాయిల్స్ ఉపయోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

పరిశుభ్రతపై అవగాహన



తుని 20వ వార్డులో వ్యాధుల నియంత్రణపై అవగాహన కల్పిస్తున్న శేఖర్

తుని: ప్రస్తుత సీజన్‌లో పరసరాల పరిశుభ్రత పాటించాలని, లేదంటే అంటువ్యాధులు సోకే అవకాశం ఉందని మున్సిపల్ ప్రజా ఆరోగ్యశాఖాధికారి శేఖర్ అన్నారు. మంగళవారం పట్టణంలోని 20, 21 వార్డుల్లో డెంగీ, మలేరియా వ్యాధులపై అవగాహన సదస్సు నిర్వహించారు. టైర్లు, ఖాళీ కొబ్బరి బొండాలు, నీటి నిల్వ చేసే గోళాలు తదితర వాటి విషయంలో జాగ్రత్తలు పాటించాలన్నారు. ఇంటి పరిసర ప్రాంతాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. మున్సిపల్ పారిశుధ్య సిబ్బందితో దోమల మందు పిచికారీ చేయించారు. ఆయ వార్డులకు సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఈగలవారి వీధిలో వ్యర్థాల తొలగింపు

స్థానిక ఈగలవారి వీధిలో రోడ్డుపై పేరుకుపోయిన వ్యర్థాలను పొక్లెయిన్‌తో తొలగించారు. స్థానికుల నుంచి అందిన ఫిర్యాదు మేరకు కమిషనర్ వెంకట్రావు ఆదేశాలతో శుభ్రపరచినట్టు శానటరీ ఇన్‌స్పెక్టర్ శేఖర్ తెలిపారు. రోడ్డుపై వ్యర్థాలను వేయవద్దని స్థానికులకు సూచించారు.

హర్‌ఘర్ తిరంగా ర్యాలీ



పెరుమాళ్లపురంలో ర్యాలీ చేస్తున్న విద్యార్థులు

తొండంగి: పెరుమాళ్లపురంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు మంగళవారం హర్ ఘర్ తిరంగా కార్యక్రమం నిర్వహించారు. లక్ష్మణుడుపేటలోని డిగ్రీ కళాశాల నుంచి జాతీయ పతాకాలతో ర్యాలీ చేశారు. ప్రజల్లో జాతీయతా భావాన్ని పెంపొందించేలా నినాదాలు చేశారు. పెరుమాళ్లపురం మెయిన్ సెంటర్ వరకూ విద్యార్థులు, స్థానికులు బైక్ ర్యాలీ నిర్వహించారు. ప్రధాన కూడళ్ల వద్ద మానవహారంగా ఏర్పడి నినాదాలు చేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ మెహర్, వైస్ ప్రిన్సిపాల్ దివాకర్, అధ్యాపకులు ఎన్ఎస్ఎస్ అధికారి రాము తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగరవేయండి



జగ్గంపేటలో జాతీయ జెండాలను పంపిణీ చేసిన బీజేపీ నేతలు

జగ్గంపేట: దేశ ప్రధాని నరేంద్రమోదీ పిలుపు మేరకు హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా ప్రతి ఇంటిపైన జాతీయ జెండాను ఎగరవేసి దేశభక్తిని చాటాలని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి మట్టా మంగరాజు పిలుపునిచ్చారు. జగ్గంపేటలో బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి దాట్ల కృష్ణవర్మ ఆధ్వర్యంలో జరిగిన మండల పార్టీ సమావేశానికి ముఖ్యఅతిథిగా వచ్చిన మంగరాజు మాట్లాడుతూ హర్ ఘర్ తిరంగా ముఖ్య ఉద్దేశాన్ని వివరించారు. అనంతరం జాతీయ జెండాలను పంపిణీ చేశారు. అలాగే జగ్గంపేట క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ విలేకరులతో మాట్లాడుతూ హర్‌ఘర్ తిరంగాను విజయవంతం చేయాలని కోరారు.

మిషన్ శక్తిపై అవగాహన సదస్సు



సదస్సులో ప్రతిజ్ఞ చేయిస్తున్న సీడీపీఓ పూర్ణిమ

జగ్గంపేట: కాట్రావులపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మిషన్‌శక్తిపై విద్యార్థినులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జగ్గంపేట ఐసీడీఎస్ సీడీపీఓ పూర్ణిమ మిషన్ శక్తి ప్రధాన లక్ష్యం, దీనివల్ల మహిళలకు కలిగే ప్రయోజనాలను వివరించారు. ఈ సందర్భంగా బేటి బచావో బేటి పడావో అనే అంశంపై డ్రాయింగ్, వకృత్వ పోటీలు, ఉపన్యాసాలు నిర్వహించి, ప్రతిభ కనబరిచిన వారికి బహుమతులు అందజేశారు. జగ్గంపేట ఎస్ఐ బలరాం, పాఠశాల ఉపాధ్యాయులు, అంగన్‌వాడి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మహిళా మార్టు అభివృద్ధికి కృషి



మహిళా మార్టు నిర్వహణపై సంఘ సభ్యులను ఆరా తీస్తున్న అరుణ్‌పాండ్యన్

కిర్లంపూడి: మహిళా మార్టులను మరింత అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నట్టు పేదరిక నిర్మూలన రాష్ట్ర సీఈఓ జి.అరుణ్‌పాండ్యన్ అన్నారు. మండల కేంద్రమైన కిర్లంపూడిలోని మహిళా మార్టు నిర్వాహణను మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వశక్తితో ఆర్థికంగా ఎదిగేందుకు మహిళా సంఘాల సభ్యులంతా కలిసి కొద్దిపాటి పెట్టుబడితో పెద్ద మార్టులకు శ్రీకారంచుట్టారన్నారు. వారు పెట్టిన పెట్టుబడికి తగ్గట్టుగానే మార్టులు మంచి లాభాలను తెచ్చుపెడుతున్నాయన్నారు. మహిళలు మరింత అభివృద్ధి చెందేందుకు త్వరలో సూపర్ మార్కెట్లను ఏర్పాటు చేస్తామన్నారు.ఈ కార్యక్రమంలో పీడీ శ్రీరమణ, మండల ఇన్‌చార్జి టి.బాబూరావు, మార్ట్ ఇన్‌చార్జి వీవీ రాయ్, ఏపీఎం ఇనకోటి శ్రీనివాస్, మార్ట్ మేనేజర్ వై.అఖీల్, సంఘం అధ్యక్షురాలు పి.ఎస్తేర్ రాణి, గుడాల సంధ్యారాణి, ఆర్.ఆదిలక్ష్మి, జి.బేబీరాణి తదితరులు ఉన్నారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

ప్రత్తిపాడు: మండలంలోని పెదశంకర్లపూడిలో ఓ వ్యక్తి అనుమానాస్పద స్థితిలో సోమవారం రాత్రి మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు.. పెదశంకర్లపూడి గ్రామ శివారు సిమెంట్ రోడ్డు సమీపాన ఆదే గ్రామానికి చెందిన మాసా ఆదినారాయణ (48) మృతి చెందాడు. విషయం తెలుసుకున్న పోలీసులు ఆ మృతదేహాన్ని స్థానిక కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌కు తరలించారు. ప్రత్తిపాడు ఎస్సై ఎం.పవన్ కుమార్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. కాగా.. వారం రోజుల క్రితం గ్రామానికి చెందిన నలుగురు వ్యక్తులు ఆదినారాయణను ఏదో విషయమై మందలించినట్టు అతడి భార్య నూకరత్నం పోలీసులకిచ్చిన ఫిర్యాదులో తెలిపింది. అన్ని కోణాలలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

కౌమార బాలికల రక్షణకు ప్రాధాన్యం ఇవ్వాలి



వి.కొత్తూరు గిరిజన ఆశ్రమ పాఠశాలలో బాలికలకు అవగాహన కల్పిస్తున్న అధికారి

తుని: కౌమార దశ బాలికలు స్వయం రక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలని గిరిజన సంక్షేమ జిల్లా అధికారి విజయశాంతి అన్నారు. మంగళవారం వి.కొత్తూరు గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన విజయశాంతి మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో చోటు చేసుకుంటున్న సంఘటనలు బాలికల రక్షణకు విఘాతం కలిగిస్తున్నాయన్నారు. ఎదైనా అనుకొని సంఘటన ఎదురైతే స్వయంగా రక్షణ పొందాలన్నారు. ఐసీడీఎస్ అడిషనల్ సీడీపీవో నిహారిక గుడ్ టచ్, బ్యాడ్ టచ్ గురించి బాలికలకు వివరించారు. గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ విజయ లక్ష్మి, శ్రీనివాస్, సుధాకర్ పాల్గొన్నారు.

విద్యార్థులకు యూనిఫాం పంపిణీ



విద్యార్థినులకు దుస్తుల పంపిణీ చేస్తున్న గ్రామస్తులు

గండేపల్లి: మల్లేపల్లి జూనియర్ మహిళా కళాశాల విద్యార్థినులకు గ్రామస్తుల ఆధ్వర్యంలో యూనిఫాం మంగళవారం పంపిణీ చేశారు. గ్రామ సర్పంచి బలిరెడ్డి వరలక్ష్మి గంగరాజు, ఉప సర్పంచి దొమ్మా శ్రీను, విద్యాకమిటీ చైర్మన్ కంచర్ల సుబ్రహ్మణ్యం, గ్రామస్తులు తిలగరెడ్డి భద్రరావు, కొల్లి త్రిమూర్తులు, సలాది బాబూరావు, తిలగరెడ్డి సూర్యప్రకాష్, దార్లంక నూకరాజు తదితరులు ఆర్థిక సహాయంతో దుస్తులను విద్యార్థినులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో హైస్కూల్ హెచ్ఎం సుధా మాధురి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పల్లెల సమగ్రాభివృద్ధికి కృషి



శిక్షణ తీసుకున్న సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులతో ఎంపీపీ, ఎంపీడీఓ



డి.పోలవరంలోని సంపద సృష్టి కేంద్రంలో సర్పంచులకు అవగాహన కల్పిస్తున్న సిబ్బంది



యర్రవరంలో తడి పొడి చెత్త కేంద్రాన్ని పరిశీలిస్తున్న సర్పంచులు

కోటనందూరు: పల్లెల సమగ్రాభివృద్ధికి సర్పంచులు, పంచాయతీ కార్యదర్శిలు సమన్వయంతో కృషి చేయాలని ఎంపీపీ లగుడు శ్రీనివాసు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో రెండవరోజు మంగళవారం సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులకు జరిగిన శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ శిక్షణ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకొని పంచాయతీలను అభివృద్ధి పథంలో నడిపించాలని సూచించారు. మాస్టర్ ట్రైనర్లు జీ అరుణ్‌కుమార్, రాజా నాగేశ్వరరావు, పృధ్వి పంచాయతీల నిర్వహణపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ జయమాధవి పాల్గొన్నారు.

సంపద సృష్టి కేంద్రాల సందర్శన

తుని: పంచాయతీల పరిధిలో ఉత్పత్తి అవుతున్న వ్యర్థాలతో ఆర్గానిక్ ఎరువును ఎలా తయారు చేస్తారో సర్పంచులు, కార్యదర్శులకు ఈవోపీఆర్డీ జయరాం వివరించారు. మంగళవారం తుని మండలం డి.పోలవరంలో సంపద సృష్టి కేంద్రంలో అవగాహన కల్పించారు. చెత్త సేకరణ, నిల్వ చేయడం, కంపోస్టు ఎరువు తయారీ తదితర అంశాలను సర్పంచులు, కార్యదర్శులకు వివరించారు. బుధవారంతో శిక్షణా కార్యక్రమం ముగిస్తుందన్నారు. మండల పరిధిలోని సర్పంచులు, కార్యదర్శులు పాల్గొన్నారు.

తడి, పొడి చెత్తపై అవగాహన

ఏలేశ్వరం: సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ తరగతుల్లో భాగంగా మంగళవారం రెండోరోజు తడి, పొడి చెత్తలపై అవగాహన కల్పించారు. సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులకు పంచాయతీ విధులు, నిర్వహణ, అభివృద్ధిపై శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా యర్రవరంలో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం వద్దకు వెళ్లి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ జె.శ్రీనివాస్, మండల విస్తరణాధికారి సూర్యనారాయణ మాట్లాడుతూ చెత్త నుంచి సంపద సృష్టించేందుకు తడి, పొడి చెత్తలను వేర్వేరుగా సేకరించాలన్నారు. గ్రామాల్లో ప్లాస్టిక్ వాడకం తగ్గించాలన్నారు.

రెండో రోజు కొనసాగిన శిక్షణ

ప్రత్తిపాడు: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సర్పంచ్‌లకు, పంచాయతీ కార్యదర్శులకు నిర్వహిస్తోన్న శిక్షణ తరగతులు రెండో రోజు మంగళవారం కూడా కొనసాగాయి. ఎంపీడీఓ ఎస్ డేవిడ్‌రాజ్ అధ్యక్షతన జరిగిన తరగతుల్లో ఈఓఆర్డీ కేవీవీఎస్ కాశీ విశ్వనాథ, ట్రైనర్లు పంచాయతీ కార్యదర్శి ద్విభాష్యం శ్రీనివాసరావు, బి.కామరాజు, ఆర్‌వీవీ రమణ, ఎల్.గంగాధర్, పి.మధుకిరణ్ పారిశుధ్య, ఘన వ్యర్థాల నిర్వాహణ, తడి, పొడి చెత్త వేరుచేయుట, వర్మీ కంపోస్టు తయారీ – మార్కెటింగ్ చేయడం తదితర అంశాలపై అవగాహన కల్పించారు. సాయంత్రం సర్పంచ్, కార్యదర్శులు మండలంలోని ధర్మవరం గ్రామంలో ఘన వ్యర్థాల నిర్వాహణపై క్షేత్రస్థాయి పర్యటన చేశారు.

సంపద తయారీపై అవగాహన కలిగి ఉండాలి

గోకవరం: చెత్త నుంచి సంపద తయారీపై సర్పంచులు, కార్యదర్శులు అవగాహన కలిగి ఉండాలని ఎంపీడీఓ టి.గోవిందు అన్నారు. మంగళవారం శిక్షణలో చెత్త నుంచి సంపద తయారీపై శిక్షణ ఇచ్చారు. సిబ్బంది గోకవరం శివారున ఉన్న కేంద్రాన్ని సందర్శించారు. ఈఓపీఆర్‌డీ రాజేశ్వరరావు, కార్యదర్శులు టంకాల శ్రీనివాస్‌రావు, గనిరాజు, సర్పంచ్‌లు కమ్మెటి అచ్చిబాబు, బత్తుల శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

15 లీటర్ల సారాతో వ్యక్తి అరెస్టు

గోకవరం: తంటికొండ గ్రామంలో సారా విక్రయిస్తున్న వ్యక్తిని గోకవరం పోలీసులు అరెస్టు చేశారు. ఎస్సై నాగ వెంకట పవన్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామంలో సారా విక్రయిస్తున్నారన్న సమాచరం మేరకు సిబ్బందితో దాడి చేసి ద్వారంపూడి శివరామకృష్ణను అదుపులోకి తీసుకుని సుమారు 15 లీటర్ల సారా ప్యాకెట్లను, బైక్‌ని స్వాధీనం చేసుకున్నామన్నారు. అతనిపై కేసు నమోదు చేసి రిమాండ్ నిమిత్తం రాజమహేంద్రవరం కోర్టుకి తరలించామన్నారు.

అపర్ణాదేవికి శ్రావణమాస పూజలు

పిఠాపురం: గొల్లప్రోలు మండలం తాటిపర్తిలో వేంచేసి ఉన్న అపర్ణాదేవికి మంగళవారం ఆలయ అర్చకులు శ్రావణమాస పూజలు నిర్వహించి ప్రత్యేక అలంకరణ చేశారు. శ్రావణమాసం రెండో మంగళవారం సందర్భంగా అమ్మవారికి బత్తాయి పండ్లతో ప్రత్యేక అలంకరణ చేయగా భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.